# పని-మనిషి

సురేంద్ర అసహనంగా అటూ యిటూ తిరుగుతున్నాడు. అప్పుడే కనికరించని గడియారం తొమ్మిదిన్నర చూపిస్తున్నది. ఇంకా వంట కాలేదు. పదికల్లా ఆఫీసులో వుండాలి. పది నిమిషాలు ఆలశ్యం అయినా లేట్‌మార్క్ పడిపోతుంది.

"సంధ్యా! ఇంకా కాలేదా వంట? పోనీ - నేను వెళతాను" లోపలికి చూస్తూ చెప్పాడు.

"అయ్యో! అయిపోయిందండి - అంత తొందరపడితే ఎలాగండి - పని మనిషి నాల్రోజులుగా రావడంలేదు. ప్రొద్దున్నే లేచి కసువూడ్చి - కల్లాపుజల్లి, అంట్లు నేనే తోముకోవాలి. ఆపైన దొరవారికి కావలసినవి సమకూర్చి పెట్టా..." సంధ్య అసహనంగా అంది. ఆమె బాధ ఆమెది.

"అయిపోయిందని అరగంట నుంచి చెబుతూనేవున్నావ్. మా ఆఫీసర్ సంగతి నీకు తెలీదు. ఆయనికింట్లో పనీ పాటా వుండదు. ఆఫీసుకు తొమ్మిదికల్లా తగలడతాడు. ఇంక ఎవరిని తప్పులు పడదామని చూస్తుంటాడు." సురేంద్ర తన భయం బైటపెట్టాడు.

"అయ్యో! ఎంత సేపటికీ మీ ఆఫీసు గురించి ఆలోచిస్తారే కాని - నా గురించి ఆలోచించరేం! నేను కూడ ఉద్యోగం చేస్తున్నాకదండీ... నేను కూడా టైం కెళ్ళాలి - లేకపోతే అందరిముందు అవమానం!" బాధగా అంది సంధ్య.

"అమ్మొగారు - అమ్మొగారు." మంగమ్మ పిలిచింది వరండాలో నిలబడి.

"సంధ్య - పనిమనిషి వచ్చినట్లుంది తీరిగ్గా కాస్త చూడు." వ్యంగ్యంగా అన్నాడు.

"అన్ని పన్లు మనం చేసుకున్నాక తనొచ్చి ఏం చేస్తుందట! ఉన్న చద్దెన్నం పట్టుకుపోవడానికి." సంధ్య విసుక్కుంటూ బయటికొచ్చింది.

సురేంద్ర భోజనం చేయడానికి వంటింట్లోకి వెళ్ళాడు.

"అమ్మగారు ! నాకు అర్జెంటుగా వంద రూపాయలు కావాలండి" మంగమ్మ బ్రతిమాలుతూ అడిగింది.

"అది తర్వాత చూద్దాం - ముందు నాల్రోజులు పని ఎగ్గొట్టావ్ - ఏం తిండెక్కువయిందా?" సంధ్య నిలదీసింది.

"లేదమ్మగారు- మా రాజయ్యకు - అదే నా మొగుడుకు పాణం బాగోలేదు - డాట్రుబాబుకు చూపిస్తే - బోల్డు మందులు రాశాడు."

చెబుతున్న మంగమ్మను సంధ్య చెప్పనివ్వలేదు.

"చూడు - ఇలా చీటికీ మాటికీ ఏదో కారణం చెప్పి పని ఎగ్గొడుతూ వుంటే....

అయ్యగారుకు అస్సలు ఇష్టమండదు. నీ జీతంలో కోతకోస్తారు రాని రోజులకు." కఠినంగా బెదిరించింది.

మంగమ్మ గుడ్లనీరు కక్కుంది. "అమ్మా! మాది పేదోళ్ళ బతుకు - కావాలని పని ఎగ్గొట్టమమ్మా! పాణం బాగోకపోతేనే రాలేంది - దానికి జీతంలో పట్టుకుంటే మాకేం మిగులుతుందమ్మా!"

"చూడు! రెండుపూటలా అన్నం పెడుతున్నాం - మాతోపాటు కాఫీగ్రా పోస్తున్నాం - ఇంకేం కావాలి? అస్సలు నాకు నీతో ఇలా మాట్లాడుతుంటే ఆఫీసుకు టైం అయిపోతుంది - సాయంత్రం రా - " సంధ్య లోపలికి పోబోయింది.

"సంధ్యమ్మగారు - ఒక్క వంద యివ్వండమ్మా - ఆ తర్వాత మీ ఇష్టం వచ్చినట్లు చేయండమ్మా! చచ్చి నీ కడుపున పుడతాను." ఏడ్పు ఆపుకుంటూ బ్రతిమాలింది.

"చాల్లాలే - అయ్యనడిగి వంద యిస్తాను - సాయంత్రం నుంచన్నా నాగా పెట్టకుండా పన్లోకి రా - ఇంకోసారి నాగా పెట్టావంటే వేరే పని మనిషిని చూసుకుంటాను." సంధ్య లోపలికిపోయి ఓ పచ్చనోటు తెచ్చిచ్చింది.

ఎంతో సంబరపడిపోతూ ఆ నోటందుకుని రెండు చేతులెత్తి దండం పెట్టి మంగమ్మ వెళ్ళిపోయింది.

సురేంద్ర హడావిడిగా భోజనం ముగించాడు.

"సంధ్య! నేను ఆఫీసుకెళుతున్నాను - పొద్దున్నే ఎవరో ఒకరు వచ్చి న్యూసెన్స్ చేస్తారు - వస్తా!" సురేంద్ర వెళ్ళిపోయాడు.

సంధ్య నాలుగు మెతుకులు గతికి ఆదరాబాదరా తన ఆఫీసుకు చేరేసరికి పదకొండు కొడ్తున్నది గడియారం. గబగబా లోపలికొచ్చి అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం పెట్టబోయింది సంధ్య. మేనేజరు చిదానందం కొరకొర చూస్తున్నాడు తన వంక.

"అమ్మా సంధ్యా! ఆఫీసు ఎన్నింటికమ్మా?"

"పదిన్నరకు సార్ - సారీ లేటయిపోయింది."

"ఆఫీసు పదకొండుకు తెరిస్తే బాగుంటుంది కదమ్మా!"

"అవున్సార్ - పదకొండయితే బాగుంటుంది."

"డోంటాక్ రబ్బిష్! మీ ఒక్కళ్ళ కోసం పదకొండు చేయాలా? అప్పుడు పదకొండున్నరకొస్తారు. అంటే! అమ్మా! మళ్లీ నీ ఆలస్యానికో కథ చెప్పి నా మనసు పాడుచెయ్యద్దు - సీట్లో కూర్చుని పనిచేయమ్మా - అర్జెంటు ఫైళ్ళు చాలా వున్నాయి." హుంకరించాడు చిదానందం.

సంధ్య ఎర్ర బడ్డ మొహంతో పోయి సీట్లో కూర్చొని పని ప్రారంభించింది.

"సంధ్యాగారు! ఇవ్వాళకూడ అష్టోత్తరం చదివాడా?" సీటు దగ్గరికొచ్చి పరామర్శించాడు కొలీగు పరాంకుశం!" కాస్త ఆలశ్యమైపోతే ఆయన బాబు సొమ్మేదో పోయినట్లు ఫీలవుతాడు."

"అదికాదు పరాంకుశంగారు - మొగవాళ్ళకన్నా - ఆడవాళ్ళకి ఎన్నో బాధ్యతలుంటాయి - అటు ఇల్లు చక్కదిద్దుకోవాలి - పైగా మా పనిమనిషి దుమ్మా - అబ్బబ్బ! ఇంట్లో క్షణం తీరికలేక చచ్చిపోతున్నానండి." సంధ్య చెప్పింది.

"అందుకేగదండీ మీ లాంటి వాళ్ళు ీసుకొచ్చేది. కాస్త రెస్టన్నా తీసుకోవచ్చు ఆఫీసులో." పరాంకుశం చెప్పాడు.

"ఆమాటకొస్తే ఇంటికన్నా గుడి పదిలం అన్నట్లు - ఆఫీసు హాయిగా వుంటుంది. కాస్త టైంకొస్తే మన జోలికి వచ్చేవాళ్ళు వుండరు." సంధ్య వప్పుకుంది.

"అంతేగదండి మరి - మనం కాఫీలకని చెప్పి గంటలు - గంటలు పోయినా అడిగేదమ్మ ఎవరికుందండి." పరాంకుశం చెప్పాడు.

"ఏంటా గుసగుసలు - ?" చిదానందం అరిచాడు.

"ఏంలేదు సార్ - ఫైల్ ఎలా పుటప్ చేయాలని డౌటొస్తే అడుగుతున్నా!" సంధ్య అవలీలగా అబద్ధం చెప్పేసింది.

"అంతేసార్ - మీరు అర్జెంటు ఫైలని మొన్న చెప్పారటకదా - అందుకని యివ్వాళన్నా దాని బూజువెలాదులపాలో అని అడుగుతూంటే---" పరాంకుశం చెప్పాడు.

"నే ఒకడ్ని యిక్కడ అఘోరించాను కదయ్యా - ఏ సందేహాలు - అనుమానాలొచ్చినా నన్ను అడగొచ్చు కదయ్యా - ఇలా ఒకళ్ళ చెవులు ఒకళ్ళు కొరుక్కోకపోతే!" చిదానందం విసుక్కున్నాడు దగ్గరికొచ్చి.

"పెద్దవారు - మిమ్మల్ని ఎందుకు ఇబ్బంది పెట్టాలని - వారి దగ్గర నా సందేహాలు నివృత్తి చేసుకుంటున్నాను." సంధ్య చెప్పింది.

"ఏం సందేహాలో ఏ మో! డౌట్లొచ్చి ఫైళ్ళని యిలా రోజుల తరబడి బూజు పట్టించేకంటే... అదేదో ముందే అడిగి సమయానికి డిస్‌పోజ్ చెయ్యచ్చుగా!" గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు చిదానందం.

"చూశారా! పోనీలే పాపంలే అని పని తొందరగా చేసిపారేస్తే వేరేపని అంటగడతాడు - అందుకని నేను ఇచ్చిన పనిని వెంటనే చెయ్యను." సంధ్య చెప్పింది.

"గుడ్!" అభినందించాడు పరాంకుశం.

గోడగడియారం పన్నెండు కొట్టడం ప్రారంభించగానే సుచిత్ర, సుమతి, రజని, సంధ్య అలా ఎదురుగా ఉన్న క్యాంటీనుకు కాఫీకి పోయి పన్నెండున్నరకొచ్చారు.

ఎదురుగా నుంచున్న సంధ్య వంక చిదానందం చిరాగ్గా చూశాడు - ఓ అరగంట కాఫీకి పోయి వచ్చింది ఆమె.

"సార్ కాస్త పర్మిషన్ కావాలి - పెళ్ళికి వెళ్ళాలి!" సంధ్య అడిగింది ఆయన వంకచూస్తూ.

"పెళ్ళా! ఎవరిది?" విషాదంగా అడిగాడు చిదానందం.

"మా ఫ్రండు ఫ్రండుది...షరాఫ్ బజారు కళ్యాణమండపంలో మిమ్మల్ని అడిగిపోదామని ఆగిపోయాం - " సంధ్య చెప్పింది.

చిదానందం బుర్రగోక్కున్నాడు. ఒకళ్ళా - ఇద్దరా - నలుగురు గంట పర్మిషన్ అడుగుతున్నారంటే ఖచ్చితంగా రెండు గంటలుపైన వాడుకుంటారు.

"లీవు పెట్టకపోయారు - ఇంత పని ఉన్నప్పుడు " చిదానందం నిదానంగా అన్నాడు.

"అమ్మో! మామూలంగా ఆఫీసు సఫర్ కాకూడదండి..... అయినా ఇటువంటి చిన్న చిన్న వాటికి లీవులు పెడతారంటండీ? ఎక్కడైనా?" సుమతి చెప్పింది.

"మీరు బాధపడ్తారని ముహూర్తంకు వెళ్ళలేదు - కనీసం భోజనానికన్నా పోకపోతే వాళ్ళు బాధపడ్తారని వెళుతున్నాం!" సుచిత్ర చెప్పింది జాలిపడ్తూ.

"పదండి-టైం దాటిపోతున్నది - ఈ చిన్న చిన్న వాటికి సార్‌ను అడగడం ఎందుకు?" రజని ముందుకు నడిచింది.

ఆమె వెంబడి మిగతా ముగ్గురూ వెళ్ళిపోయారు. చిదానందంకు చిర్రెత్తుకొచ్చి వాళ్ళు వెళ్ళిన వైపే చూస్తూ వుండిపోయాడు, అంతకుమించి ఏమీ చేయలేక.

"సార్! ఈ చిన్న చిన్న అడ్జెస్టుమెంట్లు తప్పవుసార్. పట్టించుకోమాకండి." పరాంకుశం చిదానందం దగ్గరికి వచ్చి నచ్చచెప్పాడు.

"అది కాదయ్యా! వీళ్ళు పని చేసేది ఎప్పుడయ్యా! రావడం అరగంట ఆలశ్యం - గంటసీట్లో కుదురుగా సర్దుకుని కూర్చున్నారో లేదో కాఫీకో, టీకో, ఓ అరగంట బయటికి పోవడం - మళ్ళీ సీట్లో కూర్చున్న దగ్గర్నుండి బాతాఖానీలు - ఆ తర్వాత లంచ్ - అదయింతర్వాత మళ్ళీ ఇదే భాగోతం - కబుర్లు కాకరకాయలు - కాఫీలు... నాలుగు కొట్టిందగ్గర్నుండి - ఎప్పుడెప్పుడు యింటికిపోదామని చెప్పల్లో కాళ్ళు పెట్టుకొని కూర్చోవడం - " బాధపడిపోయాడు చిదానందం.

"అంతేసార్ - కాలం మారిపోయింది. మనం చూసి చూడనట్లుపోవాలి" పరాకుంశం చెప్పాడు.

"ఛీ! ఛీ! ఇలా అయితే దేశం ఎప్పుడు బాగుపడుతుందయ్యా! జీతం తీసుకుంటున్న దానికి ఓనాలుగు గంటలు తిరిగినా - కనీసం రెండు గంటలన్నా సిన్సియర్‌గా పనిచేయాలి

కదయ్యా?" చిదానందం ఆవేశపడ్డాడు.

"సార్! ఇవన్నీ అంత సీరియస్‌గా తీసుకోకూడదు. అడిగి చెడ్డకాకండి - అసలే ప్రమోషన్ జాబితాలో వున్నారు. మళ్ళీ యూనియన్లతో గొడవపడితే ఏ పనీకాదు. చెడ్డ పేరొస్తుంది - అయినా మీకెందుకు సార్ ఇవ్వన్నీ !" ఎత్తి పొడిచాడు పరాంకుశం.

"నాక్కాకపోతే నీకు పట్టిందిటయ్యా! నేను మేనేజరయ్యా ఇక్కడ - డ్యామేజర్ని కాదు - వెళ్ళి నీ పనిచూస్కో. జీతం తీసుకుంటున్నాం - ఉద్యోగం చేయాలన్న గ్నానం వుండాలి - పోవయ్యా - పన్లు చూసుకో!" చిదానందం మండిపడ్డాడు.

సంధ్య ఇంటికొచ్చేసరికి సురేంద్ర ముసుగు పెట్టి నిద్రపోతున్నాడు. తలుపు చాలా సేపు బాదింతర్వాత తీశాడు.

"అదేంటండి? రోజూ నాకన్నా ఆలశ్యంగా వచ్చేవాళ్ళు. ఎప్పుడొచ్చారండి?" గాబరాగా అడిగింది లోపలికొస్తూ.

"ఏంలేదు - కొంచెం ఫీవరిష్‌గా వుంటే మధ్యాహ్నం ఇంటికొచ్చి పడుకున్నాను - " చెప్పాడు.

"లీవు పెట్టారా?"

"ఫ్రెంచి లీవు"

"ఏదొకటిలేండి - ఎంత భయమేసిందో! వుండండి. కాఫీ పెడతాను - షాపింగ్‌కు పోయేసరికి లేటయింది." సంధ్య సంజాయిషీ యిస్తూ స్టవ్ మీద వేణ్ణీళ్ళు పడేసింది.

"అన్నట్లు మంగమ్మ రాలేదా సాయంత్రం!" అడిగింది.

"మంగమ్మ! ఎందుకొస్తుంది - డబ్బులిచ్చావుగా!"

"ఓసి! వంద యిచ్చాను సాయంత్రం వస్తుందని నమ్మి! ఈ లేబర్ని అస్సలుకు నమ్మకూడదు. సందు దొరికితే పని ఎగ్గొడతారు. అబ్బా! ఈ గిన్నెలన్నీ తొమాలంటే ప్రాణం పోతుంది. అయినా ఇంత మహాపట్టణంలో మీకు పని మనిషి దొరకదుటండీ!" విసుక్కుంది.

"ఈ కాలం కష్టపడితే ఉద్యోగాలన్నా దొరుకుతాయికానీ, పనిమనుషులు మటుకు దొరకరు - అయినా మన పనికి ఎవరి మీదో ఆధారపడ్డం దేనికి - మన పని మనమే చేసుకోవాలి - " శ్రీరంగనీతులు చెప్పాడు సురేంద్ర.

"ఏమిటీ! ఎవరి పని వాళ్ళే చేసుకోవాలా? అయితే ఈ నాలుగు గిన్నెలు తోమిపెట్టండి." విసురుగా అంది సంధ్య.

"ఛీ! మొగాడ్ని - అంట్లు తోమడమా?" బిక్కమొహం పెట్టాడు.

"ఇప్పుడేకదండీ మీరు సుమతి శతకం చదివారు." సంధ్య గుర్తు చేసింది. "మీ

భాగం కింద ఈ నాలుగు గిన్నెలు - తోమండి - మన పని మనమే చేసుకోవాలి గదా-"

"మన అంటే- అంటే - నీ అని అర్ధం - రాయల్ ఉయ్ వాడాను అంతే!" నాలిక్కరుచుకున్నాడు సురేంద్ర.

ఇకముందెప్పుడూ మాటలు జారకూడదనుకున్నాడు.

ఆదివారం ఉద్యోగస్తులపాలిట ఓ వరం!

ఆరోజు అందుకే సంధ్య కూడ కాస్త ఆలశ్యంగా లేచింది. బారెడు పొద్దెక్కింది. అప్పుడే రేడియోలో వార్తలు కూడా అయిపోయాయి. జానపద సంగీతం వినిపిస్తున్నది.

"సంధ్యా! కాఫీ రెడీనా!" బెడ్మీంచి కేకేశాడు సురేంద్ర.

"అబ్బబ్బ! అంట్లు గిన్నెలు ఎక్కడివక్కడే ఉన్నాయి. ఈ రోజు మంగమ్మ వస్తేనే పన్లయ్యేది. నాకు చేతకాదు, ఈ అంట్లు తోమడం చేతులు పుండ్లు పడుతున్నాయి" విసుక్కుంది.

దేవుడు వరమిచ్చినట్లుగా ఓ అరగంటకు మంగమ్మ వచ్చింది. ప్రాణం లేచొచ్చింది సంధ్యకు. గబగబా అంట్లు తెచ్చివేసింది.

"ఎలా వుందే నీ మొగుడికి?" సంధ్య అడిగింది.

"అలాగే ఉందమ్మగారు - పెద్దాసుపత్రిలో పడేశాను. ఇంక ఆ దాౖతుదేముళ్ళే దిక్కు" అంట్లు తోముతూ చెప్పింది.

"ఏంటిట జబ్బు!"

"నాకేటి తెలుస్తాది."

'నీకే కాదు - ఆ డాక్టర్లక్కూడ తెలీటంలేదుటే ఈ మధ్య" సురేంద్ర చెప్పాడు బ్రష్ చేసుకుంటూ.

"అట్టానే ఉంది బాబు - గంట గంటకి డాకటేర్లు వచ్చి సూసిపోతున్నారు. సిత్రంగా వుంది." మంగమ్మ చెప్పింది.

"చూడు మంగమ్మా! ఇవ్వాళ ఆదివారం కదా! ఇల్లు తడిగుడ్డతో తుడిచి ముగ్గులు పెట్టు - " సంధ్య చెప్పింది.

"అమ్మగారు - ఆసుపత్రికెళ్ళాలి - ఈవారం సెయ్యలేను."

"సంధ్యా! చెప్పడం మరిచాను - మా గోపాలంగాడ్ని - వాడి పెళ్ళాన్ని మనింటికి భోజనానికి పిల్చాను" సురేంద్ర చెప్పాడు ఆమెకు.

"ఏంటీ భోజనానికి పిల్చారా? బావుందండి - ఉన్న ఒక్క ఆదివారం రెస్టు తీసుకుందామనుకుంటే - ఎవ్వళ్లనో నానెత్తిన ఎక్కిస్తారా? ఇల్లెలా వుంది? బాగు చేసేవాళ్ళు లేరా - మంగమ్మ వెళుతుందిట!" సంధ్య చెప్పింది.

"మంగమ్మ! ఇవ్వాల్టికి అమ్మగారు చెప్పిన మాట విను. గెస్టులు వస్తున్నారు." తాపీగా చెప్పాడు.

"నా మొగుడుకు బాగోలేదు సారూ - అక్కడెవరూ లేరు. నే తొందరగా పోయి సూసుకోవాలి." మంగమ్మ చెప్పింది.

"ఏం ఫర్వాలేదు - బోల్డంత మంది నర్సులు - డాక్టర్లు చూస్తూవుంటారు - నువ్వేం ఖంగారు పడమాకు - ఓ పది నిమిషాల్లో పని పూర్తి చేసి పోదువుగాని." చెప్పాడు సురేంద్ర. మంగమ్మ అయిష్టంగానే ఊరుకుంది.

"సారీ సంధ్య! రెండు రోజులుగా నీకు చెబుదామని మర్చిపోయాను. స్పెషల్స్ ఏమీ చెయ్యద్దులే - నే బజారునుండి తెస్తాను. మామూలు వంట చెయ్యి - చాలు" చెప్పాడు సురేంద్ర మౌనంగా వున్న సంధ్యను చూసి.

"అదికాదండి. ఉన్న ఒక్క ఆదివారం ఇలా పాడుచేసుకుంటే మనకు రెస్టు ఎప్పుడండి?"

"అయ్యో పిచ్చి సంధ్య! వీళ్ళని ఊరికే పిలవడంలేదు. గోపాలం నాపై అధికారి - ప్రమోషన్లు రాబోతున్నాయి. కొంచెం అతడ్ని కాకాపడితేకానీ, ప్రమోషన్ తొందరగా తెచ్చుకోలేం." వివరంగా చెప్పాడు.

ఎవరో పిల్లాడు వచ్చి మంగమ్మ చెవిలో ఏదో చెప్పాడు.

"అమ్మగారు! నేను పోతాను - నా మొగుడుకి పాణం బాగోలేదట." మంగమ్మ కంగారు పడింది.

"పోదువుగానిలే ఆ కాస్త పని పూర్తి చేసుకునిపో-" సంధ్య చెప్పింది కోపంగా.

"నాకు కాళ్ళుసేతులు ఆడ్డంలేదమ్మగారు!" మా రాజయ్యకు ఎలా వుందో ఏమో!"

"మంగమ్మా! డాక్టర్లు వస్తారు - చూస్తారు - మందులిస్తారు - నువ్వు పోయి చేసేదేముంది? ఓ అయిదునిమిషాలు వుంటే పనయిపోతుంది." సురేంద్ర చెప్పాడు.

"నాకు సేతకాదు బాబుగారు - నా జీతం యిప్పించండి -" మంగమ్మ చెప్పింది తెగించి.

"ఇప్పుడు జీతానికేం తొందరేం!" సంధ్య ఆశ్చర్యంగా అంది.

"మందులు - డబ్బు అవసరమవుతుంది-" మంగమ్మ చెప్పింది.

"అయినా నీకేమొస్తుంది ఈ నెల - వారం రోజులు నాగా పెట్టావు - నో వర్క్ నో పే - పని చెయ్యని దినాలకు జీతం లేదు - ఇంక వంద అప్పుగా ముందే తీసుకున్నావు - సరిపోయింది." సంధ్య అంది దృఢంగా.

మంగమ్మకు కళ్ళెంబడి నీళ్ళు తిరిగాయి.

"అమ్మగారు! రెండేళ్ళుగా యిస్వాసంతో మీ యింట్లో పని సేస్తున్నా! మా రాజయ్యకు బాగలేకపోతే - నే కొన్ని దినాలు రాలేదు - నిజమే! అందుకని నా జీతం తెగకోస్తారా అమ్మగారు?" ఆశ్చర్యంగా అడిగింది.

"ఏం? మాకు ఊరికే డబ్బులిస్తారా? కష్టపడితేనే మాకు డబ్బులొచ్చేది - చెట్లకేం కాయడంలేదు." సురేంద్ర చెప్పాడు కోపంగా. మంగమ్మ ఇలా ఎదురుతిరగడం అతనికేం నచ్చలేదు.

"ఊరుకొండయ్యా! మీరా కష్టపడేది! ఆ యమ్మ ఓ గంట కూడ కుదురుగా ఆఫీసులో పని సెయ్యదు - మీరు యూనియన్ అంటూ ఎప్పుడూ బయట తిరుగుతుంటారు. మీకివ్వటంలా వేలకు వేల జీతాలు - మీరు పని సెయ్యడం లేదని పట్టుకున్నారా?" మంగమ్మ ఆవేశంగా అడిగింది.

"ఒసే - నోర్మూయ్!" సంధ్య గయ్‌మంది.

"ఎందుకమ్మగారు - మీకు పనిసేయకపోయినా ఎన్నో సెలవలు - అదేంటి క్యాజువల్‌లీవంట - ఎర్నులీవంట - ఇంకా సిక్కులీవంట - ఇన్నిస్తే మీరు చేస్తున్న పనేంటి? నేను పొద్దస్తమానం కష్టబడ్డా కడుపునిండదు - ఏ సెలవు వుండదు - పని స్థిరంగా వుండదు. ఇదెక్కడి న్యాయం అమ్మగారు." మంగమ్మ బాధపడ్తూ నిలదీసింది.

"అవును నీకివన్ని ఎలా తెల్సు!" సంధ్య అడిగింది.

"మారాజయ్య పనిచేసేది మీ చిదానందం ఇంట్లోనే!" మంగమ్మ చెప్పింది.

( ఆకాశవాణి సౌజన్యంతో 1994 )